
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 అక్టోబర్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





గొలగమూడిలో అభివృద్ధి పనులు

వెంకటాచలం :సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తూర్పు చెరువు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు శాశ్వతంగా యాజమాన్య హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేయడం తనకు సంతోషంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం గొలగమూడి లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. తొలుత 25 లక్షలతో నిర్మించిన చేపల మార్కెట్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తాగునీటి



పునరుద్ధరణ పనులు, సైడ్ కాలువలు ప్రారంభించారు. తదుపరి గొలగమూడి వెంకయ్య స్వామి ఆలయ కళ్యాణ మండ పంలో నిర్వహించిన జగనన్న సురక్ష, పట్టాల పంపిణీ కార్యక్ర మంలో మంత్రి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయంతోనే

సమగ్రాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు - 30న కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిన నాడే సమగ్రాభివృద్ధి సాధ్య మౌతుందని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా ఇటీవల సిపిఎం చేపట్టిన పాదయాత్రల సమయంలో గుర్తించిన పలు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ అన్ని రాజకీయ, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె. అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ జిల్లా సమగ్రాభి వృద్ధి కోసం రామయపట్నం, ఉదయగిరి, ఇరువూరు ప్రాంతాల నుంచి సిపిఎం పాదయాత్రలు నిర్వహిం చగా పలు అంశాలు ముందుకొచ్చాయన్నారు. రామయపట్నం పోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వం రైతుల నుంచి బలవంతపు భూసేకరణ చేసిందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం సక్రమంగా అందజేయలేదన్నారు. రామాయపట్నం రైతులు ప్రభుత్వం భూసేకరణ 2013 చట్టాన్ని అనుసరించి తమకు నష్టపరిహారం అందజేయాలంటూ ఈ నెల 30వ తేదిన కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహి స్తున్నారన్నారు. స్థానికులకు 75 శాతం ఉద్యోగా వకాశాలు కల్పించాలని చట్టంలో ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం ఆచరణ చేయలేదని, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పించడంలో విఫలమైందన్నారు. ఉలవపాడు ప్రాంతం సమీపంలో మామిడి, సపోట వంటి పండ్ల తోటలున్నాయని, ఈ తోటలను ఆధారంగా చేసుకొని జ్యూస్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశం ఏర్పడుతుందన్నారు. గిరిజన, దళిత వాడలను పరిశీలినప్పుడు అనేక ప్రాంతాల్లో స్మశాన వాటికలు అందుబాటులో లేవన్నారు. భూములు వారి చేతుల్లో లేదని గుర్తించామన్నారు. ఈ సమస్యలన్నింటిని కలెక్టర్ దృష్టికి సిపిఎం జిల్లా కమిటీ తీసుకెళ్లిందన్నారు. భూ కొనుగోలు పథకంలో ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి దళితులకు, గిరిజనులకు పంపిణీ చేస్తే ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడమే కాకుండా వ్యవసాయం సైతం వారి చేతుల్లోకి వస్తుందన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల ఒలేటి వారిపాళెం, లింగసముద్రం, కలిగిరి, కొండాపురం ప్రాంతాల్లో సాగునీరు, తాగునీరు అందుబాటులో లేదన్నారు. సోమశిల ప్రాజెక్టు ఉత్తర కాలువను వెడల్పు చేయడం వల్ల ఆ ప్రాజెక్టు నుంచి వృదాగా పోతున్న నీటిని రాళ్లపాడు ప్రాజెక్టుకు తరలిస్తే ఈ రెండు సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సోమశిల ప్రాజెక్టుకు రక్షణ కవచం అయిన అప్రాన్ గత ఏడాది వచ్చిన వరదల వల్ల కొట్టుకు పోయి ందన్నారు. ఈ సమస్యలను వామపక్షపార్టీలు, రైతాంగం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ అనుమతితో 97 కోట్ల వ్యయంతో టెండర్లను పిలిచారని, 20 కోట్లు నిధులను ఖర్చు చేసి పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే కాంట్రాక్టర్ వెనుతిరిగి వెళ్లిపోయారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ పనులు పూర్తి చేయకపోతే జిల్లా ముంపుగు గురౌతుందన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సిపిఎం పలు దఫాలుగా పోరాటాలు చేసిందని, ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఇంకా 70శాతం పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. వెంకటాచలం మండల పరిధిలోని నక్కల కాలువ పూడిక తీయడం వల్ల వెంకటాచలం మండల పరిధిలోని ముత్తుకూరు మండల పరిధిలోని రైతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆత్మకూరు ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం స్థల సేకరణ చేసిందని, ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉదయగిరి మెట్ట ప్రాంతంలో ఉన్న అనేక మందికి ఉపాధి అవకాశం కలుగుతుందని బావిస్తే ఆ పరిశ్రమలను బద్వేల్ ప్రాంతానికి తరలించారన్నారు. ఈ ప్రాంతంలోని యువత ఉపాధి కోసం మహానగరాలకు వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా సమగ్రాభివృధి సాధించాలంటే అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వ్యవసాయం అభివృద్ధి కావాలని, ఉపాధి హామీ చట్టం ప్రకారం కేంద్ర నిధులు కేటాయించాలన్నారు.సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, సిపిఎం నాయకులు గోగుల శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాసులు, మూలి వెంగయ్య, తుళ్లూరు గోపాల్, సిపిఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి, నాయకులు షేక్ షాన్‌వాజ్, సిరాజ్, డివైఎఫ్ఐ నాయకులు బి.నరసింహా, ఫయాజ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీని వాసులు, న్యూ డెమోక్రసీ నేతలు రాంబాబు ఉన్నారు.

సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులురాలు డి రమాదేవి విమర్శ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపు, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, ఫలితంగా ప్రజలపై భారాలు పడ్డాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి విమర్శించారు. శనివారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 30వ తేది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి సిపిఎం ఆధ్వర్యంలో బస్సుయాత్రలు ప్రారంభం కానున్నా యన్నారు. నవంబరు 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తుందని డి.రమాదేవి పేర్కొన్నారు. ముందుగా ప్రజారక్షణ భేరీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనం తరం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. నిరుద్యోగ సమస్య తాండవిస్తుందని, మహిళలకు రక్షణ కరువైపోయిందన్నారు. నాలుగు రోజుల కిందట కృష్ణా జిల్లా మోపిదేవి మండలం. పనికి వెళ్లిన ఓ మహిళపై జరిగిన దాడి అమానుషమన్నారు. మహిళను పనికి పిలిపించి యజమాని,పోలీసు సంరక్షణలేదని, ఎస్‌పి సైతం ఆ మహిళను చితకబాదిన ఘటన పరిశీలించినా, జిల్లాలో మైకా ఘనుల వద్ద అక్రమ తవ్వకాలపై నిన్న, మొన్న పత్రికల్లో వచ్చిన కథనాలు పరిశీలించినా, రాష్ట్రంలోని ప్రకృతి వనరులన్నింటిని దోచేస్తున్నారన్నారు. చివరకు ప్రజల వద్ద ఉన్న భూములను సైతం దోచేసుకుంటున్నారని విమర్శించారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో విఫలం కావడం, జలగల్లా పీల్చుకు తినే పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదన్నారు. ఇటువంటి తరుణంలో ప్రజా రక్షణ భేరిని సిపిఎం నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి పంపిణీ చేయాలని,ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తుం దన్నారు. ఈ నేపథ్యంలో ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను అమలు చేయడం కోసం ప్రజలందరూ ముందుకు రావాలని ఈ బస్సు యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. వెయ్యి మంది రెడ్‌షర్టు వాలంటీర్లతో పెద్ద కవాతు,అదే విధంగా 30 వేల మంది ప్రజలతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, భారీ స్థాయిలో మహిళలు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌బీ, డి. అన్నపూర్ణమ్మ, షేక్ రెహానాబేగం, నగర కమిటీ సభ్యులు కె.పద్మా ఎన్.వి.సుబ్బమ్మ, టి. శివ కుమారి, రూరల్ ఐద్వా అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి, ఐద్వా సీనియర్ నాయకురాలు అరిగెల రమమ్మ, ఎం.ప్రమీల, మున్వర్ సుల్తానా తదితరులు ఉన్నారు.

మద్యనిషేధంపై మాట తప్పిన సిఎం : సిపిఎం

నెల్లూరు : వైసిపి అధికారంలోకి వస్తే దశలవారీగా మద్యపాన నిషేదం అమలు చేస్తామంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు అనుమతులు ఇచ్చి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె ఎన్నికల సమయంలో చేసిన హామీలను వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందని మహిళలందరూ సంతోషపడ్డారన్నారు. అందులో భాగంగా ప్రతి ఏడాది 20 శాతం దుకాణాలు తగ్గించాల్సి ఉంద న్నారు. మొదటి దశలో బెల్టు షాపులు రద్దు చేసిన ఈ ప్రభుత్వం నేడు ఎక్కడ పడితే అక్కడ మద్యం అమ్మడానికి అనుమ తిచ్చిందన్నారు. నాడు అధికారంలోకి వచ్చిన రోజు ఏ విధంగా నిషేధించారో ఈ రోజు అందుకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా యన్నారు. మద్యం అమ్మకాల్లో పారదర్శకత లేదని, ఆన్‌లైన్ అమ్మకాలు, ఎంత అమ్మింది, ఎంత వచ్చిందోలెక్కలేదని, ఇష్టారాజ్యంగా మద్యం షాపులు పెట్టి వ్యాపారాలు చేస్తున్నా రన్నారు. వైసిపి మిత్ర పక్షమైన బిజెపి అధ్యక్షురాలు రాష్ట్రంలో మద్యం అమ్మకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వానికి చెందిన వారే అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణ చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం సాయంత్రం లోగా మద్యం అక్రమ వ్యాపారాలపై సమాధానం చెప్పాలని పేర్లను ప్రకటించకపోతే తానే ప్రకటిస్తానని చెప్పి నేడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

బిజెపి ప్రభుత్వ అవకాశవాదం

పాలస్తీనాపై ఇజ్రా యిల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే నిలిపి వేయాలని ఐక్యరాజ్య సమితి నిర్వహించిన ఓటింగ్ ప్రక్రియలో భారత దేశం పాల్గొనకుండా అవకాశవాదంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి విమర్శించారు. శనివారం సిపిఎం కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశానికి ఆమె హాజర య్యారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె



మాట్లాడుతున్న రమాదేవి

మాట్లా డుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ పెత్తనం చెలాయి స్తుంద న్నారు. పాలస్తీనా దేశీ యులను అక్రమంగా, బహిరంగంగా జైల్లో బంధించడం అమా నుషమన్నారు. యుద్ధం జరు గుతున్న సమయంలో అనేక మంది మహిళలు, పిల్లలు మరణిస్తు న్నారన్నారు. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని పిలుపునిచ్చి దన్నారు. అందులో భాగంగా ఐక్య రాజ్యసమితి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా, 120 దేశాలు మద్దతుగా ఓటింగ్ చేశాయన్నారు. భారత దేశం ఈ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా దూరంగా ఉండి అవకాశవాదంతో వ్యవహరించిందన్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలలో జరుగుతున్న యుద్ధాన్ని వ్యతిరేకించకుండా బల హీనమైన స్థితిలో మతోన్మాద పార్టీగా బిజెపి ఉందన్నారు. అటువంటి పార్టీ కేంద్రంలో పాలన చేస్తూ దేశంలో ఆధిపత్య రాజకీయాలు, పెత్తందారీ రాజ కీయాలు అమలు చేసి ప్రజలకు తీవ్రంగా నష్టం చేకూరు స్తుందన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ లవన్న

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్ : వాల్మీకులకు ప్రభుత్వం తరపునుంచి అందాల్సిన ప్రతి పథకాన్ని అందజేసేందుకు కృషి చేస్తామని డిఆర్‌ఒ లవన్న పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జిల్లా స్థాయి జయంతిని స్థానిక దర్గామిట్టలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్‌ఒ లవన్న హాజరై మాట్లాడారు. మూఢనమ్మకాలు, అంటరానితనం పోవా లంటే విద్యతోనే సాధ్యమ న్నారు. శాలివాహన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి ఆదిశేషయ్య, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడారు. జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, ట్రైనీ జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శివలీల బీసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయమ్మ నిర్మలమ్మ ఉన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో...

నెల్లూరు రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఎస్‌పి కార్యాలయంలో శ్రీ వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రామాయణంను రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి అన్నారు.

ఆలయంలో పరిశీలన

కందుకూరు :కందుకూరులోనిఅంకమ్మ తల్లి ఆలయం ముందు భాగంలో నూతనంగా నిర్మించబోయే అనివేటి మండప స్థలాన్ని, ఆలయం చుట్టూ నిర్మించబోయే షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈఈ సతీష్ పరిశీలించారు. సతీష్ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో నిర్మించబోయే అనివేటి మండపం, షాపింగ్ కాంప్లెక్స్ స్థలాన్ని పరిశీలించామని ఆలయ శిల్పి శ్రీనివాస్ కు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు తగు సూచనలు సలహాలు అందజేశామన్నారు. దేవాదాయ, శాఖ డిఇ జనార్ధన్, ఎఇ మురళి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కె కోటేశ్వరరావు ఉన్నారు

పర్మినెంట్ చేయాలని కోరుతూ

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో చేసిన హామీలలో భాగంగా మున్సిపల్ కార్మికులను ఫర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నగరంలో కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. శనివారం గాంధీబొమ్మ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈ నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె పెంచల నరసయ్య, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా అసెం బ్లీలోనూ, పాదయాత్రలోనూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఫర్మినెంట్ చేస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలలో



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అందరికి ఉద్యోగ భద్రత కల్పిస్తామనిఆర్భాటంగా హామీలు చేసిందన్నారు. ఈ హామీని మున్సిపల్ కార్మికులు గట్టిగా నమ్మి ఓట్లేసి గెలిపించి అధి కారాన్ని కట్టబెట్టారని, అయితే వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచిన ఏ ఒక్కరిని ఫర్మినెంట్ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ నెంబర్ 114 ద్వారా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఆ జిఒలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల ఊసే లేదన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2020లో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆప్కాసే అనే బానిస వ్యవస్థలోకి నెట్టివేసిం దన్నారు. మున్సిపల్ కార్మికుల ఆప్కాసులోకి చేర్చడం వలన 60 సంవత్సరాలు దాటిన కార్మికులను ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్ లేకుండా ఇళ్లకు పంపి స్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిం చుకుంటున్న నవరత్నాలు దళితులైన మున్సిపల్ కార్మికులకు తీసి వేయడం ఎంత వరకు న్యాయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెకు పోయేదానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సుజాతమ్మ, కామాక్షమ్మ, వజ్రమ్మ, సలోమి, చెన్నయ్య, కొండమ్మ, చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేసినవారిని శిక్షించాలి



నెల్లూరులో

ప్రజాశక్తి-నెల్లూరు

కావలి పట్టణ సమీపంలో మద్దూరుపాడు వద్ద జరిగిన ఆటోనగర్ డిపో డ్రైవర్ దాడిని ఖండిస్తూ ఏపీపిటిడీ కార్మికులు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. శనివారం నగరంలోని ప్రధాన ఆర్‌టిసి డిపో ప్రాంగణంలో ఉన్న ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఆర్‌టిసి ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం చేపట్టారు.యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్‌టిడి డ్రైవర్‌పై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులని చెప్పుకుంటున్న వారి కారుకు సైడ్ ఇవ్వలేదన్న కారణంగా ఆర్‌టిసి డ్రైవర్‌ను వాహనం నుంచి కిందకుదించి విచక్షణా రహితంగా దాడికి పాల్పడటం అమానుషమన్నారు. కాళ్లతో, చేతులతో రోడ్డుమీద పడవేసి మద్యం మత్తులో ఇష్టానుసారంగా దాడికి పాల్పడ్డాం న్నారు.స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు షేక్ జిలాని భాష ముఖ్యఅతిథి హాజరై ప్రసంగించడం జరిగింది. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కట్టా. సుబ్రహ్మణ్యం, ఎంప్లా యిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బాబు సామ్యూల్ నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ జోనల్ కార్యదర్శి లుక్సన్, ప్రసంగించినారు. అన్ని అసోసియేషన్ల రాష్ట్ర, జోనల్, జిల్లా, డిపో నాయకులు పాల్గొన్నారు.



సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన

కావలిలో ఆర్‌టిసి డ్రైవర్‌పై అమానుషంగా, విచక్షణారహితంగా రౌడీ మూకలు చేసిన దాడిని ఖండిస్తూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన, ర్యాలీ చేపట్టారు. శనివారం స్థానిక ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్, డిపో వరకు సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ బెంగళూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ డ్రైవర్ పై కావలిలో రౌడీ మూకలు అతి దారుణంగా దాడి చేయడం హేయమైన అన్నారు. దౌర్జన్యాలు,దాడులు చేసే వారిని అధికార పార్టీ నాయకులు బలపరచడం, ప్రోత్సహించడం లాంటి చర్యలు పూను కుంటు న్నందు వల్ల ఇవి పెరుగుతున్నాయన్నారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు రాంబాబు, పి.సుధాకర్ , మూలం.ప్రసాద్, మురళి, నాగూర్ , డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, శాఖ కార్యదర్సులు అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి, ఫయాజ్ ఉన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు :కావలిలో ఆర్‌టిసి డ్రైవర్ రామ్ సింగ్ పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ కందుకూరు ఆర్‌టిసి డిపో వద్ద ఉద్యోగ సంఘాల నాయకులు శనివారం ధర్నా చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి డ్రైవర్ రామ్ సింగును విచక్షణా రహితంగా 14 మంది కలిసి కొట్టడం దారుణమన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ కందు కూరు డిపో కార్యదర్శి దాసరి రమణయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. డిపో మేనేజర్ పెద్దన్న శెట్టి తో పాటు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్ ఎన్ రాజు, సదానందం, యన్ఎంయు నాయకులు కోటయ్య, ఎస్‌బ్ల్యుఎఫ్ నాయకులు వేమూరి వెంకటేశ్వర్లు, దగ్గుబాటి మాలకొండయ్య ఉన్నారు.



కందుకూరులో...

స్థలం విషయంలో న్యాయం చేయాలి

తోటపల్లిగూడూరు :ఇంటి నివేశన పట్టా విషయంలో తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకొంటానని ఓ మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తోటపల్లి గూడూరు మండలం, ఇస్కపాలెంలో ప్రభుత్వం కొందరు జర్నలి స్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఈ నేప థ్యంలో తోటపల్లి గ్రామ పంచా యతీ మాజీ సర్పంచ్ నారాయణ భార్య పేరుతో ప్రభుత్వం ఇంటి నివేశన పట్టా మం జూరు చేసింది. రెవెన్యూ అధికారులు లబ్ధిదారునికి తెలియకుండా ఆ పట్టాను మరో పేరుపై బదిలీ చేశారు. ఈ విషయ మై ప్రశ్నిం చిన పట్టాదారునికి రెవెన్యూ అధికా రుల నుంచి సరైన స మాధానం రాలేదు. దాంతో తీ వ్ర మనస్థాపం చెందిన మాజీ సర్పంచ్ నారా యణ తనకు జరిగిన అన్యా యంపైశనివారం, కలెక్టర్, ముఖ్యమం త్రికి లేఖలు రాశారు.

'మాలకొండ' ఆదాయం రూ. 8.9లక్షలు

వలేటివారిపాలెం :ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా భక్తులు తరలి వచ్చినారు స్వామి వారికి ఆదాయం వివిధ రూ పాలలో8, 92825 ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వాహణాధికారి శ్రీనివాసరావు తెలిపినారు.



మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలాద్రి లక్ష్మీనరసిం హస్వామి ఆలయాన్ని మాజీ ఎంఎల్‌ఎ దామచర్ల ఆంజనేయులు కుటు ంబ సమే తంగా దర్శిం చుకు న్నారు ఆలయ అధికారులు ఆయన ద్వారా ప్రత్యేక పూజలు జరిపారు. నరసింహ చార్యులు గౌరీ శంకర ఆలయ అధికారులు ఉన్నారు.

ఐఎఫ్‌సి ఫౌండేషన్ సేవలు

కందుకూరు :'ఆకలికి అందరూ బంధువులే" అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో శనివారం దాతల సాయంతో పేదల కోసం కందు కూరులో నిస్సాయులైన వద్ధులను గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు అందిం చారు. ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ తెలిపారు. ప్రెసిడెంట్ సాజిద్‌ఉన్నారు.

ముసాయిదా జాబితా విడుదల

వలేటివారిపాలెం :మండలంలోని శామీర్ పాలెం రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ -2023 సీజన్ వేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకొన్న రైతుల పేర్లను సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాను గ్రామ వ్యవసాయ సహాయకుడు సురేష్ వెల్లడించారు. శనివారం ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి ఎం హేమంత్, భరత్ కుమార్ హాజరయ్యారు.

మహిళపై అత్యాచారం

ప్రజాశక్తి -పొదలకూరు :వదినపై మరిది అత్యాచారానికి పాల్పడిన ఉదంతం పొదలకూరు మండలం అంకుపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అంకుపల్లి కి చెందిన వేమమ్మ అనే మహిళ తన చిన్న కూతురును బాలకృష్ణ అనే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసింది. వారికి ఒక బాబు ఉన్నాడు. రెండో కాన్పు కోసం ఆమె గత నెల 27వ తేదీన నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ హాస్పిటల్ కి భర్త, అమ్మతో కలిసి వెళ్ళింది. అదే రోజు సాయంత్రం బాలకష్ణ ఇంటికి చేరుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్య అక్క పై అత్యాచారానికి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే చెల్లెలు జీవితం నాశనం అవుతుందని అక్క గోప్యంగా ఉంచింది.అయితే శుక్రవారం సాయంత్రం బాలకృష్ణ వదినతో గొడవకు దిగాడు. దీంతో రాజేశ్వరి ఆ గ్రామ సచివాలయ మహిళా పోలీస్‌కు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు : రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, అన్ని దానాల కంటే రక్తదానం ఎంతో ముఖ్యమైనదని ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు , రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి ప్రారంభించి, రక్తదానం చేశారు. రక్త దానం విషయంలో అపోహలు వద్దు, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఇతరులకు ప్రాణదాతలు కావాలన్నారు. పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శాఖవరపు.వేణుగోపాల్, సభ్యుల సహకారంఅందజేశారు.పోలీస్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ సుజన్, డి. మధుసూదన్, పి.అశ్విన్ కుమార్, పి.చైతన్య కుమార్ రెడ్డి, వినీలా రెడ్డి, పి. శ్రీలత రెడ్డి, నాగేంద్ర కడప, బి.రాజేంద్ర రెడ్డి, పి. మాధవ్, కె.చిరంజీవి, కె.కల్యాణి, విద్య ఉన్నారు.


చంద్రబాబును విడుదల చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ బాబు పూర్తి ఆరోగ్యంతో ఉండాలని, నిజం గెలవాలని ఆయన బయటికి రావాలని కాంక్షిస్తూ శనివారం ఎఎస్‌పేటలోని నాయబ్ రసూల్ దర్గా లో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకుడు షేక్ రఫీ పాల్గొన్నారు.

'నారాయణ'లో

గుండె వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో 'వరల్డ్ స్ట్రోక్ డే' ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.ఎస్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ మెదడులోని కొంత భాగానికి రక్తం సక్రమంగా సరఫరా కాకుండా అంతరాయం కలిగిన సమయంలో ఉత్పన్నమైయ్యే సమస్యనే స్ట్రోక్ అంటారన్నారు. గుండెపోటులానే బ్రెయిన్ స్ట్రోక్ ఉంటుందని, ఈ సమస్యను అధిగమించేందుకు లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్సలు తీసుకుంటే వ్యాధి తీవ్రత తగ్గుతుందన్నారు. ఇతర దుష్పరిణామాలు ఉండవన్నారు. పని ఒత్తిడి అధికంగా ఉన్న వారు, షుగర్, బి.పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, 50 సంవత్సరాల పైబడిన వారు ముందస్తు పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు , మద్యపానానికి దూరంగా ఉండాలని, మానసిక వత్తిడి తగ్గించు కోవాలన్నారు. ప్రతి నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఈ సమస్యను నివారించడం సాధ్యమౌతుందన్నారు. నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు బి. హరిప్రసాద్‌రెడ్డిమాట్లాడారు. వివరాలకు 7331170063 నెంబరును సంప్రదించాలన్నారు. వైద్యశాల అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ హరీష్, డాక్టరు అనుషా, అకడమిక్ డీన్ డాక్టరు నరసింహారెడ్డి, ఆపరేషన్ హెడ్ రామారావు, వైద్యశాల ఏజిఎం ఎసి శేఖర్‌రెడ్డి, నారాయణ డెంటల్, ఫార్మసీ, ఫిజియోథెరపిస్టు, నర్సింగ్ కళాశాల సిబ్బంది ఉన్నారు.



ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అన్నారు. శనివారం ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలోని ఎపిఎస్ఆర్ సచివాలయం 15, 16, 18వ వార్డులకు సంబంధించిన మెడికల్ క్యాంపును అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సర్దార్, కమిషనర్ బి.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు చెరుకూరు కామాక్షయ్య నాయుడు, సూరా భాస్కర్ రెడ్డి, కొప్పోలు రమాదేవి, పుచ్చలపల్లి రాధిక, మహబూబ్ బాషా, గండ్ల వేణు, వైసిపి నాయకులు కొప్పోలు చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, ముజ్జు, డాక్టర్ ప్రణీత్, పద్మనాభ రెడ్డి, ఆర్ఐ ఖాసీమ్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఐ.సి.డి.ఎస్. సిబ్బంది పాల్గొన్నారు.

కొండను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-సీతారామపురం : బద్వేల్ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు శనివారం సీతారామపురం – పోరుమామిళ్ల ఘాటు మార్గంలో అదుపుతప్పి కొండను ఢీకొని ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళితే.. బద్వేలు నుండి పామూరుకు వెళుతున్న ఆర్‌టిసి బస్సు సీతారామపురం – పోరుమామిళ్ల ఘాట్ మార్గంలో బస్‌కు బ్రేకులు ఫెయిల్ కావడంతో డ్రైవర్ చాకచక్యంగా లోయలోకి బస్సు వెళ్లకుండా తప్పించడంతో ఆర్‌టిసి బస్సు పెనుప్రమాదం నుండి బయటపడింది. ఈ బస్సులో డ్రైవర్ కండక్టర్‌తో సహా 25 మంది ప్రయాణికులు ఉన్నారు. బ్రేకులు ఫెయిల్ అయిన అనంతరం డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది.

రూ.30వేల ఆర్థికసాయం అందజేత



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత నిత్య అన్నదాత కంచి పరమేశ్వర్‌రెడ్డి శనివారం మూడు కుటుంబాలకు రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. 11వ వార్డు పరిధిలోని బలిజ వీధిలో మృతి చెందిన కొలగాని దొరసానమ్మ (60) కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు. 9వ వార్డు పరిధిలోని యేనీ ప్రాంతానికి చెందిన గిరిజన మహిళ ఏలూరు లక్ష్మమ్మ మృతి చెందగా ట్రస్ట్ సభ్యులు అక్కడికి చేరుకొని రూ.10వేల నగదు ఇచ్చారు. 19వ వార్డు పరిధిలోని ఇరగన వెంకటరమణమ్మ మృతి చెందగా సమాచారం అందుకున్న ట్రస్ట్ సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబ సభ్యులు ఆపత్కాలంలో తమకు పదివేల నగదు ఇచ్చి ఆదుకున్న ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డికి, ట్రస్టు సభ్యులకు తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 11వ వార్డు ఇన్‌చార్జి గుడి చైతన్య, 9వ వార్డు కౌన్సిలర్ కొప్పాల రమాదేవి, ఇన్చార్జి కొప్పోలు చిన్నపరెడ్డి, 19వ వార్డు ఇన్‌చార్జి కొండ వెంకటేశ్వర్లు, 19వ వార్డు మెప్మా ఆర్‌పి శాంతి, ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చంద్రబాబు నాయుడు అరెస్ట్



ప్రజాశక్తి-జలదంకి : రాజకీయంగా ఎదుర్కొన లేకనే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జైలులో ఉంచిన తీరు కావాలనే అక్రమ అరెస్టు జరిగిందనడానికి నిదర్శనం అని ఉదయగిరి మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకట రామారావు అన్నారు. శనివారం మండలంలోని కమ్మవారిపాలెంలో రాముల వారి దేవాలయంలో స్థానిక నాయకులు పచ్చ పెంచలనాయుడు ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి, చంద్రబాబు నాయుడు త్వరగా జైలు నుంచి విడుదల కావాలంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో పచ్చ పెంచలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు పులుగుంట మధుమోహన్ రెడ్డి, రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర రెడ్డి, ఒంటేరు జయచంద్ర రెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, కంచర్ల వినోద్ నాయుడు, అప్పలనాయుడు, మేదరమెట్ల శేషారెడ్డి, మద్దూరి శ్రీనివాసుల రెడ్డి, ఏగూరు రఘు, ఉప్పుటూరు సుధీర్ బాబు, పచ్చ మనీషా చౌదరి, గొట్టిపాటి మనోరమ, తదితరులు పాల్గొన్నారు.

స్టాంపు విలువను పెంచడం అన్యాయం

ప్రజాశక్తి-కావలి : రాష్ట్రంలోని అన్ని కోర్టులలో సివిల్, క్రిమినల్ విస్సిలేనియస్ పిటిషన్‌పై రూ.20 విలువ గల స్టాంపు వేయాలని ఎ.పి. రాష్ట్ర ప్రభుత్వం అడ్వొకేట్స్ వెల్‌ఫేర్ ఫండ్ యాక్టు-1987లోని సెక్షన్12-బి ద్వారా ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని, చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది పొట్లూరు శ్రీనివాసులు ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలోని న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బంది పడతారని, ఈ విధానం వల్ల న్యాయవాదులకు ఏవిధమైన మేలు చేకూరదని తెలిపారు. పైగా ఈ మొత్తం న్యాయవాదుల సంక్షేమ నిధి కిందకు వస్తుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కేరళ, కర్నాటక, ఇతర రాష్ట్రాల్లో వకాలత్‌పై వేసే వెల్ఫేర్ స్టాంపు విలువ రూ.50 మాత్రమేనన్నారు. ఏపిలో మాత్రం రూ.100 ఉందన్నారు.

ఈ-క్రాప్‌పై అభ్యంతరాలు తెలపాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని బండగానిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులు జరిగిన ఈ-క్రాప్ బుకింగ్‌పై అభ్యంతరాలు ఉంటే తెలపాలని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు, హార్టికల్చర్ అధికారిణి జయశ్రీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బండగానిపల్లి రైతు భరోసా కేంద్రంలో వారు రైతులతో సమావేశమై మాట్లాడారు. ఈ - క్రాప్ బుకింగ్‌పై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు, ఈ -క్రాప్ బుకింగ్‌లో పొరపాటు ఏమైనా ఉంటే రైతులు తెలపాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని జిల్లా ఉన్నత పాఠశాల, వెంగళరావు నగర్ ఎపిఆర్ఎస్ గండిపాలెం పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎంఇఓ-1 షేక్ మస్తాన్ వలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నత పాఠశాల వెంగళరావు నగర్‌లో జరుగుతున్న మనబడి నాడు- నేడు పనులను పరిశీలించి నాణ్యమైన వస్తువులు వాడుతూ నాణ్యతతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి మన ఇంటి వద్ద ఎంత రుచికరంగా భోజనం తయారు చేస్తామో అలా చేయాలని సూచించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వాల్మీకి సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి అని ఆత్మకూరు ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ. శ్రీనివాసులు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఎం శిరీష, సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-సీతారామపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను శనివారం తహశీల్దార్ ఎన్‌వి కె సుధాకర్ రావు ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆనంతరం మండలంలోని మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి సచివాలయాలను తనిఖీ చేసి, హాజరు, మూవ్‌మెంట్ రిజిస్టర్ సిబ్బంది విధి నిర్వహణ రిజిస్టర్‌లను పరిశీలించారు.

ప్రభుత్వానికి బస్సుయాత్ర జరిపే హక్కు లేదు..



మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

ప్రజాశక్తి-ఉదయగిరి : బిసిలను రాజకీయంగా, ఆర్థికంగా అణచివేసిన వైసిపి ప్రభుత్వానికి సామాజిక బస్సుయాత్ర జరిపే హక్కు లేదని మాజీ జెడ్‌పి చైర్మన్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి నాయకులకు సామాజిక న్యాయ బస్సుయాత్రలు చేసే నైతిక హక్కు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి లేదని, అధికారం వచ్చిన తర్వాత బిసి నాయకులను ఎస్‌సిలను వేధిస్తూ అక్రమ కేసులను బనాయిస్తూ వేధిస్తు నిధులు విధులు ఉన్న పదవులను మాత్రం ముఖ్యమంత్రి తన సామాజిక వర్గానికి ఇస్తూ బిసిలకు అలంకార పదవులను మాత్రమే అందించారని విమర్శించారు. స్థానిక సంస్థలలో టిడిపి హయాంలో 34శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతంతో తగ్గించి రాష్ట్రంలో బలహీన వర్గాల వారికి 17వేల పదవులు రాకుండా చేశారని దుయ్యబట్టారు. టిడిపి చైర్మన్ లాంటి కీలక పదవులను ఒక్కసారైనా బిసి వర్గాలకు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయని ప్రశ్నించారు. బిసి ఎస్‌సి ఎస్‌టి కార్పొరేషన్ నిధులు సప్లయి నిధులను నవరత్నాలకు మరలించి బిసిలకి తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం సలహాదారు లాంటి కీలక పదవులు లక్షల రూపాయలు జీతాలు చెల్లిస్తూ సిఎం తన సొంత సామాజిక వర్గానికి అప్ప చెప్పారని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని టిడిపిలోనే బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని రాబోవు ఎన్నికల్లో బడువర్గాలే వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి అమానుషం



ట్రంక్ రోడ్డుపై ర్యాలీ చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ప్రజాశక్తి-కావలి : ఆటోనగర్ డిపో బస్ డ్రైవర్ బొందిలి రామ్‌సింగ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆర్‌టిసి ఉద్యోగులు శనివారం ఆర్‌టిసి బస్టాండ్ నుండి ఆర్.డి.ఒ. కార్యాలయం వరకు డిపో మేనేజర్ శ్రీనివాసులుతో సహా నిరసన వ్యక్తం చేస్తూ, భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్.డి.ఒ. వికె.శీనా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అక్కడి నుండి వెనుదిరిగి, డి.ఎస్.పి. కార్యాలయం వరకు వెళ్లి, డి.ఎస్.పి. వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి. స్పందిస్తూ గురువారం ఆర్.టి.సి. డ్రైవర్‌పై దాడి చేసిన వారిని గుర్తించడం, ఎఫ్.ఐ.ఆర్. కట్టడం కూడా జరిగిందని తెలిపారు. దాడి చేసిన వారు శివారెడ్డి, దేవరకొండ సుధీర్ బాబు, విల్సన్, కిరణ్,ఇంకా కొంతమంది ఉన్నారని గుర్తించినట్లు తెలిపారు. జిల్లా ఎస్.పి. తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు నిందితులపై 7 సెక్షన్‌లతో కూడిన కేసులు నమోదు చేసి, పోలీసు టీములు తయారు చేసి గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. త్వరలోనే అరెస్ట్ చేస్తామని హామీనిచ్చారు. కాగా ఆటో నగర్ డిపో బస్ బెంగళూరు నుండి విజయవాడకు కావలి బస్టాండ్ మీదుగా వెళుతుండగా గత గురువారం సాయంత్రం చాపల మార్కెట్ ఎదురుగా అడ్డు వచ్చిన కారును చూచి, డ్రైవర్ హారన్ కొట్టగా, కారులోని దుండగులు బస్ డ్రైవర్‌పై దాడి చేశారు. కొందరు అడ్డు వచ్చి విడిపించారు. అక్కడ కుదరక, మళ్లీ కారులో బస్‌ను క్రాస్ చేసి, మద్దూరుపాడు వద్ద డ్రైవర్‌ను విచక్షణా రహితంగా కొట్టిన సంఘటన వీడియో సామాజిక మధ్యమాల్లో వైరల్ అయింది. ఈ సంఘటనపై ఆర్.టి.సి. కార్మికులు స్పందించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్, ఇతర యూనియన్‌ల నాయకులు, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

ప్రజాశక్తి-కావలి : ఆర్‌టిసి డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడి అమానుష ఘటన అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి దాడులు కావలిలో రోజురోజుకు పెచ్చు మీరుతున్నా పోలీసులు స్పందించడం లేదని అఖిలపక్షం నేతలు పసుపులేటి పెంచలయ్య(సిపిఎం), చింతాల వెంకట్రావు (కాంగ్రెస్), కరవది భాస్కర్ (సిపిఐ ఎంఎల్), బలిజేపల్లి వెంకటేశ్వర్లు (సిపిఐ) పొబ్బా సాయివిఠల్ (జనసేన) ఆరోపించారు. శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో వారు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పట్టణంలో గత 4 సంవత్సరాలుగా పట్టపగలు మహిళలపైన, దగదర్తి పెట్రోల్ బంకులో పనిచేస్తున్న తేజ పైన, రైల్వే గేట్‌మెన్ పైన, హారన్కొంట్టినందుకు కారుపైన, చివరికి విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి డ్రైవర్ పైన ఇన్ని దాడులు వరుసగా జరుగుతుంటే పోలీసులకు కానీ, ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి కానీ పట్టవా అని ప్రశ్నించారు. అసలు సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇన్ని దాడులలో సగం పైగా వైసిపి నేతలు దాడులకు తెగబడిన సంగతి ఎంఎల్‌ఎ ప్రతాప్‌కుమార్ రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. ఆఖరికి ఎంఎల్‌ఎ తనకు ఏమి తెలియదన్నట్లు, ఇలాంటి దాడులు సమాజం లో మంచిదికాదన్నారు. పోలీసులు ఈ ప్రభుత్వంలో ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజల తరుపున మాట్లాడినా నిరసన తెలిపినా వెంటనే నోటీసులు ఇవ్వడం, హౌస్ అరెస్ట్‌లు చేయడం తెలిసినప్పుడు ఇలాంటి ఘటనలపై కూడా అంతే వేగంగా స్పందించాలన్నారు. ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేసిన ఈ ఘటనలో నిందలు పోలీసులందరికీ తెలుసన్నారు. కానీ వారిని అరెస్ట్ చేయడంలో మీనమేషాలు లెక్కించటం సమంజసం కాదన్నారు. విధి నిర్వహణలో డ్రైవర్‌ను విచక్షణా రహితంగా దాడి చేసినా పోలీసులు అటువంటి (354) సెక్షన్లు పెట్టకపోవటం ఎవరికి కొమ్ముకాస్తు న్నారో తెలపాలన్నారు. అలానే ఎంఎల్‌ఎ ప్రతాప్ కుమార్ రెడ్డి గ్రావెల్ మాఫియా, క్రికెట్ బిట్టింగ్, ఆడేవాళ్లు నేరస్థలకు దగ్గరుండి సపోర్ట్ చేయడం ప్రజలందరూ చూస్తున్నారని తెలిపారు. ఎంఎల్‌ఎ ఇలాంటి నేతలను కూడా మీరు మీ కార్లలో తిప్పుకుంటుంటే దేనికి సంకేతం చెప్పాలన్నారు. ఈ దాడి ఘటనలో గాయపడ్డ రామ్‌సింగ్‌కు అండగా ఉంటామని, ఆర్‌టిసి కార్మికులు చేసే ఉద్యమాలలో బాసటగా ఉంటాని అఖిలపక్ష నేతలు తెలిపారు. కార్యాక్రమంలో సిపిఐ కావలి కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, దర్గాబాబు (సిపిఐ) ఆజాం తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఖండన

ప్రజాశక్తి-కావలి : ఆర్‌టిసి డ్రైవర్‌పై కావలి పట్టణానికి చెందిన వైసిపి గుండాలు అక్రమంగా దాడి చేయడాన్ని కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు శనివారం తీవ్రంగా ఖండించారు. బెంగళూరు నుండి విజయవాడకు వెళుతున్న సమయంలో కావలి ట్రంకు రోడ్డులో అడ్డుగా ఉన్న వాహనాలకు హారన్ కొట్టినందుకు గానూ ఎందుకు హారన్ కొట్టావ్.. అంటూ మద్దూరుపాడులో బస్సును అడ్డగించి డ్రైవర్ బి.ఆర్.సింగ్‌ను బస్సు నుండి కిందకు లాగి దాడి చేయడం దారుణమన్నారు. పదిమందికిపైగా రౌడీలు విచక్షణ రహితంగా కొట్టి, కాళ్లతో తన్నుతూ ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం బాధాకరమని, ఎలాంటి తప్పు చేయని డ్రైవర్‌పై దాడి జరిపిన దుండగులను వెంటనే శిక్షించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ.. సమాజంలో అశాంతి కలిగిస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అసాంఘిక శక్తులను అదుపు చేయాల్సిన పోలీసులు రాష్ట్ర ప్రభుత్వ వికృత చర్యలను సమర్థించడం శోచనీయమన్నారు. దాడికి గురైన డ్రైవర్‌కు సరైన వైద్యం అందించాలని, దాడులకు నిరసనగా ఉద్యమిస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులకు సంఘీభావం తెలియజేస్తున్నట్లు తెలిపారు.

జనసేన ఖండన

ప్రజాశక్తి-కావలి : పట్టణంలో వైసిపి పాలనలో ఈ మధ్యకాలంలో సామాన్యులపై దాడులు ఎక్కువయ్యాయని జనసేన నాయకులు మండిపడ్డారు. సామాన్యులపై దాడులు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కావలిలో లేకుండా పోయిందన్నారు. ఒకటి కాదు రెండు కాదు ఇలా ఎన్నో మార్లు అధికారపార్టీకి చెందిన సపోర్టర్స్ చేతిలో దెబ్బలు తినడం కావలి నియోజకవర్గంలో ఆనవాయితీగా మారిందన్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి బస్ డ్రైవర్ తన విధుల్లో ఉండి, బస్సుకు అడ్డుగా ఉందని హారన్ కొడితే ఆ బస్సు డ్రైవర్‌ను వెంబడించి మరీ విచక్షణా రహితంగా 14 మంది వ్యక్తులు దాడి చేస్తున్న వీడియో దృశ్యాలను చూస్తుంటేనే ఒళ్లు గగుర్పాటుకు గురవుతుందన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, టౌన్ అధ్యక్షుడు పబ్బా సాయివిఠల్, మన్నేపల్లి రిషికేష్, తిరుమలశెట్టి సుధీర్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఆశా శ్రీనాథ్, గట్టుపల్లి క్రిష్ణయ్య, బెల్లంకొండ మస్తాన్, షేక్ ఆజామ్, గద్దె నాగార్జున, పోకల వర్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : విజయవాడ ఆటోనగర్ డిపోకు ఆర్‌టిసి డ్రైవర్ బిఆర్ సింగ్‌పై కావలిలో భౌతిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఉదయగిరి డిపో ఎదుట కార్మికులందరూ గెట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ బెంగుళూరు నుండి విజయవాడ వస్తున్న ఆర్‌టిసి బస్సును కారులో వెంబడించి కారు డ్రైవర్ తోపాటు కారులో ఉన్న వ్యక్తులు విచక్షణ లేకుండా దాడి చేయటం చాలా దారుణమన్నారు. ఈ దాడిని ఆర్‌టిసి ఎమ్‌డి, ఐపిఎస్ తీవ్రంగా ఖండించారని తెలిపారు. డ్యూటీలో ఉన్న డ్రైవర్‌ను కారుతో వెంబడించి చావు దెబ్బలు కొట్టడంపై రాష్ట్ర కార్మిక యూనియన్లు ఖండిస్తున్నాయన్నారు. డ్రైవర్‌లకు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయు డిపో కమిటీ అధ్యక్షులు మందలపు వెంకటేశ్వర్లు, ఎస్-ఎస్‌డబ్ల్యూ ఏ జోనల్ నాయకులు యస్థాని బాషా, ఈయు డిపో ఉపాధ్యక్షులు డబ్బుగుంట పెంచలయ్య, ఎన్ఎంయు నాయకులు బి నాగరాజు, రమణయ్య, సలామ్, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల వ్యాఖ్యలపై వైసిపి అభ్యంతరం

ప్రజాశక్తి-కావలి : కావలిలో ఏ నేరాలు జరిగినా సంబంధితులు తమకు సంబంధించిన విషయం కాకపోయినా, దాన్ని వైసిపి పార్టీకి అంటగట్టటం ప్రతిపక్షాలకు అలవాటై పోయిందని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్.టి.సి. బస్ డ్రైవర్‌పై దాడి చేసి కొట్టిన వారిపై తక్షణం చర్యలు చేపట్టా లని, వారు ఎంతటి వారైనా శిక్షించాలని ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పోలీసులను ఆదేశించారని తెలిపారు. అందుకే పోలీసులు వెంటనే కేసు కట్టి, 7 సెక్షన్‌లతో నమోదు చేశారని వివరించారు. ఈ విషయం తెలిసి కూడా టిడిపి నాయకులు, ప్రతిపక్షాలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతు న్నారని, దోషిలందరూ వైసిపి వారే నని అంటే ఊరుకునేది లేదన్నారు. వైసిపి నాయకులు పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనే యులు, కుందుర్తి శ్రీనివాసులు, కనమర్లపూడి వెంకట నారాయణ, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కుందుర్తి కామయ్య, కనుపర్తి రాజశేఖర్, దామిశెట్టి సుధీర్‌నాయుడు పాల్గొన్నారు.

రైతులకు నిరంతర విద్యుత్ అందించాలి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రైతులకు 9గంటల నిరంతర విద్యుత్ అందించాలని ఎపి రైతుం సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్టోబర్ నెలాఖరు కావస్తున్నా, వర్షాలు లేక చెరువులు ఎండిపోతున్నాయన్నారు. సోమశిల డ్యామ్‌లోనూ అడుగంటిన పరిస్థితి నెలకొందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయం తప్ప మరొకటి తెలియని రైతాంగం, అక్కడక్కడా వరి పైరు వేసి సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రైతులు విపత్కర పరిస్థితులలో పండిస్తున్న పరిస్థితులలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా 9గంటలు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వడంలో విఫలం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా కేవలం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 3:30 వరకు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. సాగునీరు సహజంగా అందని పరిస్థితులలో ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే విధంగా ఆత్మకూరు డివిజన్ విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. ఎపి రైతుసంఘం, కౌలు రైతుసంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, పాపిసెట్టి కృష్ణమోహన్, లక్కు కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

సబ్‌జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి : కావలి సబ్ జైలులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కావలి మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై, అక్కడ వున్న ఖైదీలకు కొన్ని చట్టాలను వివరించారు. అలాగే సమాజంలో చెడును విడిచి మంచిగా మెలగాలని తెలిపారు. లీగల్ ఎయిడ్ మెంబర్, ఐ.సాయిప్రసాద్, జైలు సూపరింటెండెంట్ చిన సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న పసుపులేటి పెంచలయ్య

ప్రజాశక్తి-కావలి రూరల్

సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం పట్టణంలోని 1వ మాస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించ కుండా జాప్యం చేస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పి నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికి అమలు కాలేదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయకుండా ఎన్నో సంవత్సరాల నుండి పనులు చేస్తున్న కార్మికులకు తక్కువ జీతాలతో ఎక్కువ పనులు చేయిస్తున్నారని తెలిపారు. చాలీచాలని జీతాలతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది చాలా అన్యాయమన్నారు. 11వ పిఆర్‌సి ప్రకారం రూ.20వేలు జీతం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రూ.15 వేలు ఇచ్చి ప్రభుత్వం చేతులు తుడిపేసుకుంటుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రాబోయే రోజులలో కార్మికులు పెద్దఎత్తున పోరాటాలు కొనసాగిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురక సీనయ్య, బిడదల మహేష్, బాబు, క్రాంతి, మహిళ నాయకులు లేటి రాజేశ్వరి, చేవూరి సునీత, కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హమాలీల నిరసన ధర్నా



ప్రజాశక్తి-కోవూరు : ఇనమడుగు సెంటర్ హమాలీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళన మూడో రోజు శనివారం యథాప్రకారం కొనసాగింది. డివైఎఫ్ఐ నెల్లూరు నగర కార్యదర్శి నరసింహ, లారీ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి దామోదర్ రెడ్డి మాట్లాడారు. సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కోవూరు మండల కార్యదర్శి గండవరపు శేషయ్య, సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి.నాగేశ్వర రావు, ఆవాజ్ నాయకులు చాన్‌బాషా, డివైఎఫ్ఐ నాయకులు జగదీష్, ఇనమడుగు సెంటర్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట సిపిఎం నాయకులు

సిపిఎం నేతలపై అక్రమ కేసులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండలంలోని పెనుబల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్న ఘర్షణలో సిపిఎం నాయకులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారు. గ్రామంలో ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో సిపిఎం – వైసిపి నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దాంతో ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అనంతరం పోలీసులు సిపిఎం నాయకులపై అక్రమ కేసులను బనాయించారు. సిపిఎం నాయకులపై 307 కేసు నమోదు చేయగా, వైసిపి నాయకులపై 324 కేసు నమోదు చేశారు. పోలీసులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి సిపిఎం నాయకులపై అక్రమ కేసులు బనాయించారని సిపిఎం నాయకులు ఖండించారు. ఈ విషయంపై నెల్లూరు రూరల్ డిఎస్‌పిని కలిసి ఫిర్యాదు చేశారు.

డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు ఎన్నిక



ప్రజాశక్తి-కావలి : కావలి సోషల్ రీఫార్మర్స్ కార్యాలయంలో శనివారం కమిటీ సమావేశంలో సభ్యులు ఆమోదం ప్రకారం గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడును నిర్ణయించారు. అదేవిధంగా లీగల్ అడ్వైజర్‌గా అడ్వకేట్ ఐ.సాయిప్రసాద్ (మెన్)ను కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడును, ఐ.సాయిప్రసాద్‌ను కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వారిని దుశ్శాలువాతో సత్కరించి కమిటీ లోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన సీనియర్ వైద్యులు డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ కావలి సోషల్ రీఫార్మర్స్ ముఖ్యంగా విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యావంతులు, పోలీసులతో అన్ని విధాలుగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. లీగల్ అడ్వైజర్‌గా ఎన్నికైన అడ్వకేట్ నోటరీ ఐ.సాయి ప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న నేరాలు-ఘోరాలకు సంబం ధించిన చట్టాలపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ నేరాలకు సంబంధించిన మహిళా చట్టాలు, సైబర్ క్రైమ్ తదితర చట్టాల్లోని అంశాలపై పోలీసులు, న్యాయవాదుల పాత్రపై క్షుణ్ణంగా అవగాహన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కావలి సోషల్ రిఫార్మర్స్ కమిటీ చేవూరు చిన్న, మొఘల్ సలీమ్ బేగ్, దిలీప్ కుమార్ రాయపాటి, షేక్ ఖాదర్ బీ, దామ మధుసూధన్ రావు, షేక్ రఫీ అహ్మద్, నందిపాటి రమేష్, సోమిశెట్టి బ్రహ్మయ్య, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

బస్సుయాత్ర విజయవంతానికి పిలుపు



ప్రజాశక్తి-ఉదయగిరి : సామాజిక సాధికార బస్సుయాత్రను నియోజకవర్గ ప్రజలు నాయకులు కార్యకర్తలు వేలాదిగా తరలి విజయవంతం చేయాలని సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, యువ నాయకులు అభినయరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గంలో 30న సోమవారం చేపట్టే సామాజిక సాధికార బస్సు యాత్రను నియోజకవర్గ పరిధిలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుండి పెద్దఎత్తున తరలివచ్చి బస్సు యాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ బస్సు యాత్ర జలదంకి మండలం లో ప్రారంభమై వింజమూరు, దుత్తలూరు మండలాలు కలుపుకొని ఉదయగిరిలోకి చేరుకుంటుందని ప్రతిఒక్కరూ సైనికుల మారి జగనన్న ఘన విజయాన్ని విజయ సంకేతాలు తెలిపేందుకు ఈ బస్సు యాత్రలో పాల్గొనాలన్నారు. ఈ యాత్ర విజయవంతం ప్రతి నాయకుడు కార్యకర్తలపై ఉందన్నారు.

బలవంతపు భూసేకరణపై ఆగ్రహిస్తున్న రైతన్నలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో రామాయపట్నం పోర్టు నిర్మాణానికి తమ భూములను ప్రభుత్వానికి అప్పగించేందుకు రైతాంగం అంగీకరించడం లేదు. రామాయపట్నం పోర్టుకు సమీపంలో పరిశ్రమలు స్థాపిస్తామని, తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అధికారులు రైతులకు చెప్పి బలవంతంగా భూములు తీసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ చర్యలను గ్రామాలు గ్రామాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే రామాయపట్నం పోర్టు స్థాపనకు అవసరమైన భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకొని నష్టపరిహారం అందజేయడంలో మోసం చేశారంటూ ఆ ప్రాంత రైతాంగం ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే సైదాపురం మండల పరిధిలో అక్రమ మైనింగ్ వ్యవహారంపై అధికార పక్షం, ప్రతిపక్షం ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. తెల్లరాయి అక్రమంగా రవాణా చేసి తమ జోబులు నింపుకొనేది అధికార పక్షమని, వాస్తవాలు ప్రజల ముందుకు తీసుకొస్తామని ప్రతిపక్ష పార్టీ మైనింగ్ క్వారీ ప్రాంతాల పరిశీలనకు మీడియాతో కలిసి వెళ్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రయత్నాన్ని భగ్నం చేసేందుకు అధికార పక్షం పోలీసు సహాయంతో టిడిపి నాయకుల ఇంటిచుట్టు కాపలాపెట్టి హౌస్ అరెస్టులు చేయించింది. ఈ వ్యవహారాన్ని ముందుగానే పసిగట్టిన కొంతమంది టిడిపి నాయకులు పోలీసుల కళ్లుగప్పి సైదాపురం చేరుకున్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రల సమయంలో తాము గుర్తించిన పలు అంశాలను నివేదిక రూపంలో తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షణ కావాలంటూ సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మూడు బస్సు యాత్రలను మూడు చోట్ల నుంచి ప్రారంభించింది. ఈ బస్సు యాత్రలు నవంబరు 15 నాటికి విజయవాడ చేరుకొని లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

- వీక్షణం